క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ నిర్వాహకులు కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని వెల్లడించారు.

విలేజ్ సర్వేయర్ల పెన్‌డౌన్



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విలేజ్ సర్వేయర్లు

కలువాయి(సైదాపురం): మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న విలేజ్ సర్వేయర్లు శనివారం పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్యామ్ సుందర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రమోషన్లు ఇచ్చి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కలువాయి ఏవోగా కళారాణి



బాధ్యతలు చేపట్టిన ఏవో కళారాణి

కలువాయి (సైదాపురం): కలువాయి మండల వ్యవసాయాధికారిణిగా కళారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రతాప్ పొదలకూరుకు బదిలీ అయ్యారు. రైతులకు పంటల సాగులో మెళకువలు తెలియజేస్తామని తెలిపారు.

చిన్నారి చదువులకు ఆర్థిక సాయం



చిన్నారి తల్లికి నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి

చిల్లకూరు : గూడూరు రెండవ పట్టణం గాంధీ నగర్‌కు చెందిన నాగిశెట్టి హరిబాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందారు. ఆయన కుమార్తె తోషితాను చదువులకు సాయం చేస్తామని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు మాట ఇచ్చారు. ఇందులో భాగంగా శనివారం ట్రస్టు ప్రతినిధి ప్రజేంద్రరెడ్డి చేతుల మీదుగా రూ.10 వేలను పాప తల్లి మనీషాకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ హరిబాబు వైద్యం ఖర్చులకు ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేసినట్టు తెలిపారు. ఆ సమయంలో అతని కుమార్తె చదువులకు సాయం అందిస్తామని మాట ఇచ్చామన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ



డీవీ సత్రం బాలికల హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను శనివారం తహసీల్దార్ శైలకుమారి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన వసతులుపై ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అని వార్డెన్ శేషమ్మను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. తగిన వసతులు కల్పించాలన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం ఎన్‌సీసీ 10ఏ నావల్ యూనిట్ శిక్షణ శిబిరాన్ని క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువతను సేవాదృక్పథం కలిగిన పౌరులుగా మార్చడంలో ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌సీసీ ద్వారా శారీరక, సైనిక శిక్షణ ఇవ్వడం కాకుండా ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఉన్న విశాలమైన క్రీడా మైదానంలో పదిరోజులు ఎన్‌సీసీ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఆరు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్‌వో మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

అడుగంటిన స్వర్ణముఖి బ్యారేజ్

స్వర్ణముఖి బ్యారేజ్ నీరు ఆధారంగా వాకాడు మండలంలో వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఇప్పటి వరకు తగినంత వర్షం కురవలేదు. బ్యారేజ్‌లో నీరు అడుగంటింది. ఈ నీటిని నమ్ముకుని పంటలు సాగు చేసిన ఆయకట్టు రైతులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా ప్రభుత్వం ప్రతిఏటా ఏప్రిల్, మే నెలల్లో 200 క్యూసెక్కుల తెలుగు గంగ నీటిని విడుదల చేసేది. తద్వారా రైతులు పొలం పనులు ప్రారంభించేవారు. ఈ ఏడాది ఆ ఊసే లేకపోవడంతో ఏమి చేయాలో అర్థంకాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

- గంగ నీటిని విడుదల చేయని ప్రభుత్వం
- ప్రశ్నార్థకంగా మారిన ఖరీఫ్ సాగు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు



నీరు లేక ఎడారిగా మారిన స్వర్ణముఖి బ్యారేజ్

వాకాడు : వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ నీటి ఆధారంగా 11 చెరువులు ఉన్నాయి. అలాగే పులి కాలువ, రొయ్యల కాలువ, చల్లాకాలువ, వాగులు, వంకలు, పిల్ల కాలువలు కలిపి 16 వరకు ఉన్నాయి. వీటి ఆధారంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 2,600 మంది రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో పంటలు సాగుచేసుకుంటున్నారు. ప్రతి ఏడాది లాగానే ఈ సారి బ్యారేజ్‌కి గంగ నీటిని విడుదల చేస్తారన్న నమ్మకంతో రైతులు చెరువులు, బోర్ల ద్వారా వచ్చే అరకొర నీటి ఆధారంగా పూర్తి స్థాయి విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. ప్రస్తుతం బ్యారేజ్‌తోపాటు దాని ఆధారిత జలాశయాలు ఎండిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

గతంలో ముందుగానే జలాలు విడుదల

గత ప్రభుత్వ హయాంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఏటా బ్యారేజ్‌కి వరద నీరు పుష్కలంగా చేరి సంవత్సరం పొడువునా నీరు నిల్వ ఉండేది. అంతేగాక ముందు జాగ్రత్తగా ఏప్రిల్ నెలలో అదనంగా 200 క్యూసెక్కుల తెలుగు గంగ నీటిని విడుదల చేసేవారు. దీంతో రైతులు రెండు పంటలే కాకుండా మూడో పంట సాగుకు సిద్ధమయ్యేవారు. ఎటు చూసినా పచ్చని పైర్లు కనిపించేవి. పొలాల్లో పనిచేస్తూ మహిళలు కనిపించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో సందడి ఉండేది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సమయం మించిపోతున్నా నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది.

అడుగంటిన భూగర్భ జలాలు

బ్యారేజ్ ఆధారంగా 1,850 తాగునీటి బోర్లు వున్నాయి. వాటి ద్వారా ప్రజలకు వేసవిలోనూ నీరు సమృద్ధిగా సరఫరా చేసేవారు. ప్రస్తుతం బ్యారేజ్‌లో నీరు అడుగంటింది. ఎడారుని తలపిస్తోంది. ఎడగారు రైతులకు ఎండమావిని మిగిల్చింది. బోర్లలోనూ నీరు తక్కువగా వస్తుండడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కొందరు రైతులు బోర్ల ఆధారంగా పంటలు పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ భూ గర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు పనిచేయడం లేదు. పస్తుతం మూడు మండలాల్లో మూడు పంటలు కాదు కదా.. ఒక్క పంట కూడా పండించలేని పరిస్థితి దాపురించింది. పాలకులు స్పందించి తెలుగు గంగ జలాలను విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

> **నాలుగేళ్లుగా సాగునీటికి కొరతలేదు**
>
> 
>
> గత నాలుగేళ్లుగా బ్యారేజ్ ఆయకట్టు రైతులకు సాగు, తాగునీటి సమస్య రాలేదు. ఈ సారి అదును దాటుతున్నా గంగ జలాలు విడుదల కాకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి గంగ నీటిని విడుదల చేయాలి.
>
> – పాకం చెంగయ్య, కల్లూరు పల్లిపాళెం
>
> **నీటిని విడుదల చేస్తేనే ఖరీఫ్ సాగు**
>
> 
>
> బ్యారేజీకి తెలుగంగ నీరు విడుదల చేయకపోతే ఈ ఏడాది ఖరీఫ్ పంటలు ఎండిపోతాయి. కండలేరు డ్యామ్ నుంచి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలి. రెండో తడికి నీరు లేకపోతే అదునుకు ఎరువులు కూడా వేయలేక పోతున్నాము.
>
> – వల్లం బాలయ్య, వాకాడు





ఎండుతున్న ముట్టెంబాక చెరువు, వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతు

నేడు సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు

నాయుడుపేట టౌన్ : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీతో సోలార్ ప్యానళ్లు పెట్టుకోవచ్చని, దీనిపై నాయుడుపేటలోని ఏఎల్‌సీఎం గ్రౌండ్ వద్ద ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై సోలార్ విద్యుత్ సంస్థల ప్రతినిధులు వినియోగదారులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి వినియోగదారుడూ తమ ఇంటిపై సోలార్ ప్యానళ్లు పెట్టుకుంటే కలిగే లాభాలను వివరిస్తారని వెల్లడించారు. ఇందుకు అవసరమయ్యే రుణాన్ని బ్యాంకుల నుంచి ఇప్పించనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



సతీష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు : గూడూరు పట్టణం సంయుక్త నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మనుబోలు సతీష్‌రెడ్డి తండ్రి రాధాక్రిష్టారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ శనివారం సంయుక్తనగర్ వెళ్లి రాధాక్రిష్టారెడ్డి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సతీష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోడూరు మీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

వాకాడు : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని ఏవో దీప తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రైతులకు 8 టన్నుల యూరియా అందజేశామన్నారు. ఇంకా 4 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కల్లూరు, నెల్లిపూడి రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు యూరియా అందజేసినట్టు పేర్కొన్నారు. రైతులు తమను కలిస్తే యూరియా తెప్పిస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.



రైతులకు యూరియా అందజేస్తున్న అధికారులు

ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు - వదిలేశారు



రోడ్డు పక్కన నిలిపిన ఇసుక టిప్పర్

తడ: తమిళనాడు వైపు తరలిపోతున్న ఇసుక టిప్పర్‌ను శనివారం బీవీపాళెం చెక్‌పోస్టు వద్దనున్న పోలీసు ఔట్‌పోస్టు సిబ్బంది పట్టుకున్నారు. కూటమి పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో పట్టుకున్న కొద్ది సేపటికే వదిలేశారు. సూళ్లూరుపేట నుంచి 12 టైర్ల టిప్పర్ సుమారు 50 టన్నుల ఇసుక తీసుకుని బీవీపాళెం మీదుగా తమిళనాడు బయలుదేరింది. తనిఖీ కేంద్రం వద్ద సిబ్బంది పరిశీలించి అదుపులోకి తీసుకున్నారు. మీడియా సిబ్బంది అక్కడ ఉండడాన్ని గమనించిన పోలీసులు టిప్పర్‌ని పక్కన పెట్టించారు. కొంత సమయం గడిచే సరికి టిప్పర్ అక్కడ కనిపించకుండా పోయింది. బడా నాయకుడు ఫోన్ చెయ్యడంతో పోలీసులు వదిలేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 22 టన్నుల కెపాసిటీ కలిగిన ఈ టిప్పర్‌లో రెండింతలు ఇసుక నింపి పట్టలు కప్పి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుండడం గమనార్హం. ఆంధ్రా నుంచి తమిళనాడుకు అక్రమ రవాణాను కట్టడి చేయాలన్న ఉద్దేశంతో బీవీపాళెం పాత చెక్‌పోస్టు వద్ద 6 నెలల క్రితం తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు గొర్రెలు, బర్రెల వాహనాల సిబ్బందిని ఇబ్బంది పెట్టడం మినహా గ్రావెల్, ఇసుక టిప్పర్లను పట్టుకున్న దాఖలాలు లేవు.

ఇష్టారాజ్యంగా మట్టి దోపిడీ



బీవీపాళెం చెరువులో ట్రాక్టర్లలో మట్టిని నింపుతున్న హిటాచి

తడ: మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. తమిళనాడుకు సరిహద్దులోని బీవీపాళెం గ్రామంలో వున్న చిన్న చెరువు కట్ట పనులను గ్రామానికి చెందిన కూటమి నేత చేయిస్తున్నాడు. పనులు పూర్తయినా హిటాచి తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లతో తమిళనాడుకు తరలిస్తున్నాడు. దీనిపై గ్రామస్తులు శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వీఆర్వోను పంపించారు. పెద్దల నుంచి ఫోన్ రావడంతో అధికారులు పక్కకు తప్పుకున్నారు. తర్వాత అక్రమ రవాణా యథావిధిగా సాగింది. గ్రామంలోని ఇరుకు వీధుల గుండా ట్రాక్టర్ల ద్వారా నిరంతరాయంగా మట్టిని తిరుగుతుండడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ శరత్ పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అందించారు. వారు రంగ ప్రవేశం చేసి వాహనాలను క్షేమంగా ఒడ్డుకు చేర్చి రవాణాను తాత్కాలికంగా ఆపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా తూతూమంత్రంగా వాహనాలను ఆపించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





గ్రామంలోని ఇరుకు వీధుల గుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, తమిళనాడుకు తరలిపోతున్న మట్టి

కండలేరులో 35.457 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 35.457 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,400, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ నేతల నిరసన



శ్రీచైతన్య పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కోట: నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం కోటలో వున్న శ్రీచైతన్య పాఠశాల వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, దీంతో పిల్లు ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. ఫీజులు, పుస్తకాల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, యశ్వంత్, ప్రణయ్, అభిలాష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

రాపూరు: రాపూరులోని షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం ఆలయ 34వ వార్షికోత్సవం సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం దామిశెట్టి సురేష్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ, భజన చేపట్టారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాఠశాల ముందు మురుగు నీటి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు : మండలంలోని తంబుగారిపాళెం ప్రాథమిక పాఠశాల ముందు నిలిచిన మురుగు నీటిని అధికారులు శనివారం తొలగించారు. పాఠశాల ముందు మురుగు నిలుస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల ముందు నిలుస్తున్న మురుగు నీరు అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి జనార్దన్, వైద్య శాఖ అధికారులు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కాలువ ఏర్పాటుచేసి మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పాఠశాల ముందు మురుగు నీటిని వదిలే గ్రామస్తులకు నోటీసులు జారీ చేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.



పాఠశాల ముందు మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లిస్తున్న వైద్య సిబ్బంది

మూడో రోజుకు చేరిన కార్మికుల దీక్ష



దీక్ష చేస్తున్న కార్మికులు

వెంకటగిరి రూరల్ : మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న దీక్ష శనివారానికి మూడో రోజుకు చేరింది. ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉద్యోగులు ఎనిమిదేళ్లకు మించి ఒక చోట పనిచేయడానికి వీలు లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారని తెలిపారు. ఆయనను వెంటనే బదిలీ చేయాలని, లేనిపక్షంలో దీక్షను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రటరీ వి.పెంచలయ్య, సుబ్బయ్య, ఎస్.ప్రసాద్, పి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం కాదు.. మురుగు నీరు



నాయుడుపేట పట్టణంలోని బీఎంఆర్ నగర్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన పెద్ద ఎత్తున మురుగు నీరు నిలుస్తోంది. అందులో మురుగు పచ్చగా పేరుకుపోయింది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. బీఎంఆర్ నగర్ నుంచి వెలువడే మురుగు నీరు ఇక్కడికి వచ్చి చేరుతోంది. నీటిని తొలగించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. – నాయుడుపేట టౌన్

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు ఊంజల్ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణం చేపట్టారు. తదుపరి సహస్రదీపాలంకరణ మండపానికి తీసుకువచ్చి ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.





స్వామి వారి కల్యాణం చేస్తున్న అర్చకులు, ఊంజల్ సేవకు స్వామి, అమ్మవార్లను తీసుకువస్తున్న అర్చకులు

యోగాతో మానసిక ఒత్తిడి నియంత్రణ

చిట్టమూరు/దొరవారిసత్రం/కలువాయి (సైదాపురం)/సైదాపురం/వెంకటగిరి రూరల్/కోట/బాలాయపల్లి (సైదాపురం)/చిల్లకూరు/రాపూరు/సూళ్లూరుపేట/తడ/నాయుడుపేట టౌన్ : ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్ర మం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లోనూ ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటుచేసి ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో యోగాసనాలు వేయించారు. అధికారులు యోగా చేయడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. యోగాను దినచర్యల్లో భాగం చేసుకోవాలని సూచించారు. మానవ హారాలు ఏర్పాటుచేశారు.

- గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి వెంకటనాగపవన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పలు పాఠశాలల్లోనూ యోగా కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచనారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్ న్యాయవాదులు మహబూబ్‌బాషా, నాగవెంగళరెడ్డి, దినకర్‌రెడ్డి, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.
- వెంకటగిరి కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. యోగావల్ల కలిగే ప్రయోజనాలను జడ్జి వివరించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో యోగా కార్యక్రమం





కలువాయిలో యోగా చేస్తున్న విద్యార్థులు, గూడూరు కోర్టులో యోగా కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు